

సిద్దిపేట కలెక్టరేట్‌లో రాజ్యాంగ ప్రతిజ్ఞ చదువుతున్న కలెక్టర్ కే.హైమావతి

## రాష్ట్ర స్థాయి పోటీలకు భార్గవి ఎంపిక




ములుగు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ములుగు మండలం క్షీరసాగర్ జడ్పీహెచ్ఎస్ 8వ తరగతి విద్యార్థిని భార్గవి ఎంపికైంది. ఉమ్మడి మెదక్ జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న నర్సాపూర్‌లో నిర్వహించిన జూనియర్ క్రీడాకారుల ఎంపికల్లో పాల్గొన్న భార్గవి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొన్యాల మమత బాల్‌రెడ్డి, పూర్వ విద్యార్థి సాయిప్రసాద్ ఆమెకు అభినందనలు తెలిపారు.

## సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలి

గజ్వేల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే వలీ అహ్మద్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయం నుంచి ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ప్రధానమంత్రికి ఈమెయిల్ ద్వారా వినతిపత్రాలను పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలోని లోకసభ, రాజ్యసభ సభ్యులను కలిసి వినతి పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు వచ్చి రెండు నెలలు గడుస్తున్నా తీర్పుపై సమీక్ష కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని, సీనియర్ ఉపాధ్యాయులకు భరోసా, ఉద్యోగాలకు రక్షణ కల్పిస్తామనే భరోసా కూడా ఇవ్వడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సీనియర్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇస్తూ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో చట్టం చేయాలని కోరారు.

పల్లెల్లో పంచాయతీ పోరు వేడెక్కుతోంది. ఏ గ్రామంలో ఎవరెవరు బరిలో ఉంటున్నారు. వారి బలాబలాలపైనే చర్చ సాగుతోంది. ఇక గెలవడానికి ఎంత ఖర్చు చేయాలి..? ఏ రకంగా ఖర్చు పెట్టాలి..? డబ్బులు వెచ్చిస్తే బయటపడతామా.. లేదా? నమ్మకంగా ఓట్లు వేస్తారా.. మోసం చేస్తారా..? అనే అనుమానాలు ఆశావహుల మెదళ్లను తొలుస్తున్నాయి. అందుకే ఏ మాత్రం టెన్షన్ లేకుండా ఉండేందుకు ఏకగ్రీవ ప్రయత్నాలు మొదలుపెట్టారు. నేటి నుంచే తొలివిడత ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేస్తున్న క్రమంలో పోటీ లేకుండా ఉండేందుకు పావులు కదుపుతున్నారు.




# ఏకగ్రీవ ఎత్తులు

- పోటీ లేకుండా చూసుకుంటున్న ఆశావహులు
- గ్రామాలకు నజరానా.. పోటీదారులకు కానుకలు
- పలుచోట్ల రూ.కోటి వెచ్చించేందుకు సిద్ధం
- గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రయత్నాలు



సిద్దిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మెదక్ జిల్లాలోని 1,663 గ్రామ పంచాయతీలు 14,098 వార్డులకు మూడు విడతలుగా ఎన్నికలు జరగనున్నాయి. దాదాపు రెండేళ్ల కాలంగా పల్లెల్లో సర్పంచ్‌లు, వార్డుసభ్యులు లేక పోయారు. దీంతో బరిలో నిలవాలనుకున్న ఆశావహులు రెండేళ్ల నుంచి ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో గ్రామాల్లో ఎన్నికల రణరంగం మొదలైంది. నువ్వా నేనా అంటూ పోటీకి కాలు దువ్వుతున్నారు.

### ఇక్కడ హాట్ కేక్..

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, గుమ్మడిదల, కంది, సంగారెడ్డి, కొండాపూర్, సదాశివపేట మండలాల్లోని పలు గ్రామాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నాయి. రియల్‌ఎస్టేట్ పరంగా అభివృద్ధి చెందాయి. పారిశ్రామికంగానూ ఆదాయం సమకూరుతోంది. దీంతో ఈ గ్రామాల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు రూ.కోటి ఖర్చు చేసేందుకైనా సిద్ధపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏకగ్రీవం చేసినా గ్రామానికి రూ.కోటికి పైగానే వ్యక్తిగతంగా నజరానా ఇవ్వడానికి కూడా ముందుకు వస్తున్నట్లు తెలుస్తున్నది. ఇక సిద్దిపేట జిల్లా మర్కుక్, ములుగు, సిద్దిపేట అర్బన్, గజ్వేల్, వర్గల్, కుకునూరుపల్లి, కొమురవెల్లి, జగదేవ్‌పూర్ మండలాలు, మెదక్ జిల్లా తూప్రాన్, మనోహరబాద్, మాసాయిపేట, చేగుంట, చిన్నశంకరంపేట మండలాల్లోని పలు ఆదాయ వనరులున్న గ్రామాలపైనా

మిగతా 7లో

### నేటి నుంచి నామినేషన్లు..

నేటి నుంచి తొలివిడత ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. 29 వరకు గడువు ఉండగా, 30న నామినేషన్లను పరిశీలిస్తారు. డిసెంబరు 1, 2 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 3న ఉపసంహరణ ఉంటుంది. ఇక డిసెంబరు 11న పోలింగ్, అదే రోజు కౌంటింగ్ చేపడతారు. తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామాల్లోనే ప్రస్తుతం సందడి నెలకొంది. అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేయాలా.. నిరాడంబరంగా వేసి వచ్చేయాలా అని ఆశావహులు అభిప్రాయాలు సేకరిస్తున్నారు. కాగా రెండు, మూడు విడతలు నిర్వహించే గ్రామాల్లో పోటీదారులు ఖర్చుకు భయపడి ఇంకా తెరమీదకు రాలేదు.



సిద్దిపేట కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమైన కలెక్టర్ హైమావతి

# ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లపై సీపీ విజయ్ కుమార్‌తో కలిసి జిల్లా ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మూడు విడతల ఎన్నికల కోసం మొత్తం 508 గ్రామ పంచాయతీలు, 4,508 పోలింగ్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా ఎస్ఎస్‌టి (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్), ఎఫ్ఎస్‌టీ (ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్) బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. నవంబర్ 27న మొదటి విడత, 30న రెండో విడత, డిసెంబర్ 3న మూడో విడత నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ఉంటుందని, మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీ విజయ్ కుమార్ మాట్లాడుతూ క్రిటికల్, నార్మల్ పోలింగ్ స్టేషన్ల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య, సీపీవో నాగేశ్వర్, జడ్పీ సీఈవో రమేష్, ఆర్డీవోలు, ఏసీపీలు తదితర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్, కార్యాలయంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.

## అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి విద్యార్థులు

- జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంపిక
- ఈ నెల 30న ఆన్‌లైన్‌లో సాహిత్యభేరి పేరుతో కార్యక్రమం

7లో

# ఆశల యాసంగి

- సాగుకు సన్నద్ధమవుతున్న రైతన్న
- వానాకాలంలో అతివృష్టితో తీవ్ర నష్టం
- ఈ సీజన్‌లో సాగు విస్తీర్ణం అంచనా 4.12 లక్షల ఎకరాలు
- అత్యధికంగా 3.64 లక్షల ఎకరాల్లో వరి సాగుకు అవకాశం



సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది అతివృష్టి పంటలను తీవ్రంగా దెబ్బతీసింది. భారీ వర్షాల కారణంగా చేతికొచ్చే సమయంలో పంటలకు నష్టం వాటిల్లడంతో సిద్దిపేట జిల్లా రైతుల ఆశలు అడియాశలయ్యాయి. దిగుబడులు ఆశించిన స్థాయిలో రాకపోవడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోయారు. పెట్టిన పెట్టుబడి కూడా దక్కక అప్పుల భారంతో సతమతమవుతున్నారు. అయినా, ఆత్మవిశ్వాసం కోల్పోకుండా రైతులు తిరిగి యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్నారు. నష్టాలను పూడ్చుకునే తపనతో వానాకాలం పంటలను తొలగించి, వ్యవసాయ పనులను ప్రారంభించడానికి సిద్ధమవుతున్నారు. భూమాతను నమ్ముకుని, యాసంగి సీజన్‌పైనే ఆశలు పెట్టుకున్నారు.

### అగ్రస్థానంలో వరి

ఈ యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 4.12 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో వరి సాగు అగ్రస్థానంలో ఉంటుందని భావిస్తున్నారు. వరితో పాటు, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, స్వీట్ కార్న్, శనగ, వేరుశనగ వంటి పంటలను రైతులు సాగు చేయనున్నారు.వానాకాలంలో విస్తారంగా వర్షాలు కురవడంతో భూమిలో తేమ సమృద్ధిగా ఉంది. దీనివల్ల యాసంగి పంటలకు నీటి కొరత ఉండదని రైతులు భావిస్తున్నారు. ఇప్పటికే పలువురు రైతులు పొలాలను దున్ని, విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకున్నారు.

### పంటల మార్పిడిపై అవగాహన కల్పించాలి

గతంలో వ్యవసాయ అధికారులు రైతు సభలు నిర్వహించి, యాసంగిలో ఏ పంటలు వేసుకోవాలో రైతులకు సలహాలు, సూచనలు అందించేవారు. అయితే, ఈ ఏడాది యాసంగి సమీపిస్తున్నా పంటల సాగుపై సరైన అవగాహన కల్పించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఏ పంటలు వేయాలోనని రైతులు సందిగ్ధంలో ఉన్నారు. ముఖ్యంగా, పంటల మార్పిడి వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ అధికారులు క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహించి, మంచి దిగుబడి, లాభాలు వచ్చే పంటల సాగుపై సలహాలు, సూచనలు అందించాలని రైతులు కోరుతున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యాసంగి సాగుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి స్వరూప రాణి తెలిపారు. అన్ని మండలాల్లో విత్తనాలు, ఎరువుల నిల్వలు సరిపడా ఉన్నాయని స్పష్టం చేశారు.

**యాసంగి సాగు అంచనాలిలా..**

| పంట పేరు | సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) |
|---|---|
| వరి | 3.64 లక్షలు |
| మొక్కజొన్న | 31,416 |
| పొద్దు తిరుగుడు | 12069 |
| స్వీట్ కార్న్ | 965 |
| శనగ | 579 |
| వేరుశనగ | 456 |
| ఇతర పంటల | 90 వేలు |



చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులో వరి కోత తరువాత కానరాని గడ్డి

## గడ్డికి గడ్డు కాలమే

- చైన్ హార్వెస్టర్లతో వరి కోత
- పనికిరాకుండా పోతున్న గడ్డి

చిన్నకోడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈసారి వర్షాలు ఎక్కువగా కురవడంతో పాటు, ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్‌తో వరి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికీ చాలావరకు వరి పొలాల్లో నీరు ఉండడంతో తప్పని పరిస్థితుల్లో రైతులు చైన్ హార్వెస్టర్లతో కోతలు చేపడుతున్నారు. దీంతో గడ్డి పీచుగా మారి బురదలో పడిపోవడంతో దేనికీ పనికిరాకుండా పోతున్నది. టైర్ల హార్వెస్టర్‌తో కోతలు చేపడితే పశువులకు కొంత మేత లభించేదని పలువురు రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది పశువుల మేతకు గడ్డు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రైతులకు తప్పని అదనపు భారం...

చిన్నకోడూరు మండల వ్యాప్తంగా వర్షాకాలంలో 22 వేల ఎకరాల్లో వరి సాగైంది. సాధారణంగా టైర్ల హార్వెస్టర్‌కు గంటకు రూ.2 వేలు ఖర్చు అవుతుండగా, చైన్ మిషన్‌కు మాత్రం గంటకు రూ.3,800 చొప్పున ఖర్చు అవుతుంది. దీంతో రైతులపై రూ.1,800 అదనపు భారం పడుతుంది.

## కల్యాణం.. కమనీయం

- వర్గల్ విద్యాధరి క్షేత్రంలో ఘనంగా శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

వర్గల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వర్గల్ విద్యాసరస్వతీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్కంద షష్ఠిని పురస్కరించుకుని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఉదయం సతీసమేతులైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి విశేష పంచామృతాభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు, దివ్య దర్శనం, లక్ష పుష్పార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. దేవతామూర్తులను ఆలయ పురవీధుల్లో భక్తుల భజనలు, కోలాటం, ఆధ్యాత్మిక సంబరాల మధ్యన ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించిన కల్యాణ వేదికపై స్వామి వారిని అధిష్ఠింపజేసి వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్యన కల్యాణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఆలయ వ్యవస్థాపకులు చంద్రశేఖర శర్మ సిద్ధాంతి దంపతులు సమర్పించారు. సుమారు గంటన్నర పాటు జరిగిన ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదాలను ఆలయ కమిటీ అందజేసింది.

## ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ములుగు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ బుధవారం మండలంలోని శ్రీరాంపూర్‌కు వచ్చారు. గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో దుర్గామాత ఆలయ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రజల సుభిక్షంగా ఉండాలని భగవంతుడిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ప్రభాకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్‌లో గుడిని ర్మాణానికి భూమి పూజ చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

# గుడి, బడి.. గమనించండి..!

- వంద మీటర్ల దూరంలోనే వైన్స్‌లు ఏర్పాటు చేయాలి
- గతంలో నిబంధనల బేఖాతరు.. ఈసారైనా జాగ్రత్తలు తీసుకోవాలని పలు సంఘాల నాయకుల డిమాండ్..

సిద్దిపేట క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుడి, బడి ప్రాంతాల్లో మద్యం దుకాణాల ఏర్పాటుపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ ప్రాంతాల్లో వైన్స్‌లు ఏర్పాటు చేయవద్దని ఆందోళనకు దిగుతున్నారు. జిల్లాలో మొత్తం 92 వైన్ షాపులు ఉన్నాయి. 2025-27 సంవత్సరానికి లక్కీ డ్రాలో దక్కించుకున్న వ్యాపారులు డిసెంబర్ 1 నుంచి కొత్త వైన్ షాపులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వారు తమకు నచ్చిన ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో నలుమూలలా మొత్తం 14 వైన్ షాపులు ఉన్నాయి. తమ దుకాణాలను తమకు నచ్చిన స్థలాలకు ఎక్సైజ్ అధికారుల అనుమతితో మార్పిడి చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తాలో దాసాంజనేయ దేవాలయం పక్కన వైన్ షాప్ ఏర్పాటు చేస్తుండడంపై ఆలయ కమిటీ సభ్యులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఇక్కడ దసరా వేడుకలు వైభవంగా జరుగుతాయని, భక్తులకు, మహిళలకు ఇబ్బంది కలుగుతుందని చెబుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో చౌరస్తాలో వైన్స్ ఏర్పాటు చేయకూడదని ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, హిందూ సంస్థల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దేవాలయం సమీపంలో వైన్స్ ఏర్పాటు చేయకుండా చూడాలని వివిధ వర్గాల నాయకులు కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం సమర్పించారు. మంగళవారం బీజేపీ నాయకులు రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తాలో వైన్స్ ఏర్పాటు చేయకూడదని ధర్నా చేసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. సిద్దిపేట పట్టణంలోని మెదక్ రోడ్డు, కాంచిటీ వద్ద, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర



రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

- మిగతా 8వ పేజీలో..

## ఒకే ఈతలో రెండు దూడలు



రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

నారాయణఖేడ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆవులు సాధారణంగా ఒక ఈతలో ఒక దూడకే జన్మనిస్తాయి. నారాయణఖేడ్ మండలం చాప్టా.కె గ్రామానికి చెందిన రైతు శశికాంత్‌కు చెందిన ఆవు బుధవారం ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. రెండు దూడలు జన్మించడం అరుదుగా జరుగుతుంది. ఈ సందర్భంగా పశు వైద్య సిబ్బంది దూడలను పరీక్షించారు. ఆవుతో పాటు దూడలు ఆరోగ్యంగా ఉన్నా ప్రత్యేక సంరక్షణ అవసరమని యజమానికి సూచించారు. అలాగే జన్యువు కారణంగా ఒకే ఈతలో రెండు దూడలు అరుదుగా పుడతాయని చెప్పారు. ఈ విషయం తెలిసిన గ్రామస్థులు దూడలను ఆసక్తిగా తిలకించారు.

### పశువుల అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

జహీరాబాద్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాల నుంచి జహీరాబాద్‌లోని అల్లానా కర్మాగారానికి వాహనాలపై పశువులను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ జాగో అధ్యక్షుడు రాములు నేత కోరారు. బుధవారం జిల్లా రవాణాశాఖ అధికారికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు మానవత్వం మరిచిపోయి పశువులను ఇరుకు వాహనాల్లో నింపి అల్లానా పశువధ శాలకు తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## యువకుడి ఆత్మహత్య కేసులో ముగ్గురిపై కేసు



గంగెల్ల పవన్‌కల్యాణ్ (ఫైల్)

వర్గల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించిన యువతి దక్కడం లేదని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనలో.. గౌరారం పోలీసులు యువతి తరఫు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన గంగెల్ల పవన్‌కల్యాణ్(21) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని మూడేళ్లుగా ప్రేమిస్తున్నాడు. ఇద్దరిది వేర్వేరు కులాలు కావడంతో పెద్దలు వీరి ప్రేమకు అడ్డుచెప్పారు. సంవత్సరం క్రితం ఇరు కుటుంబాల మధ్య గొడవల జరిగాయి. ఇద్దరూ దూరంగా ఉండాలని ఆంక్షలు విధించారు. ఇటీవల యువతి తల్లిదండ్రులు వేరే వ్యక్తితో పెళ్లి కుదిర్చారు. ఆ పెళ్లి ఇష్టం లేని యువతి పవన్‌కల్యాణ్‌కు ఫోన్‌చేసి ఇద్దరం పారిపోయి పెళ్లి చేసుకుందాం.. లేదంటే ఇద్దరం ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. దీంతో ఈ నెల 18న రాత్రి 10 గంటలకు పవన్‌కల్యాణ్ యువతి ఇంటికి వెళ్లాడు. ఇంతలో యువతి తండ్రి చీర్ల శ్రీనివాస్, బాబాయ్ చీర్ల మహేష్, యువతి మామ వనం తిరుపతి వచ్చి పవన్‌కల్యాణ్‌ను తీవ్రంగా కొట్టారు. ఆ దెబ్బలకు తట్టుకోలేక పవన్‌కల్యాణ్ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. అతడి ఆరోగ్యం క్షీణించడంతో ఈనెల 23న హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ 25న మృతిచెందాడు. మృతుడి తండ్రి గంగెల్ల యాదగిరి ఈ నెల 22న ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌కల్యాణ్ వాంగూల్మాన్ని మెజిస్ట్రేట్ రికార్డు చేశారు. పవన్‌కల్యాణ్ మృతిచెందిన తర్వాత దాడిచేసిన చీర్ల శ్రీనివాస్, వనం తిరుపతి, చీర్ల మహేష్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా.. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వారిని చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



ప్రహరీ లేని పీచేర్యాగడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణం

## ప్రహరీ లేక పరేషాన్

- అధ్వానంగా పీచేర్యాగడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ
- ప్రహరీ నిర్మించాలని మంత్రిని, కలెక్టర్‌ను కోరినా నిరాశే

కోహీర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలోని పీచేర్యాగడి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 147 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పొలిమేరలో ఉన్న ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడం వల్ల పశువులు, విషసర్పాలు వస్తున్నాయి. సెలవు దినాల్లో ఆకతాయిలు పాఠశాలలోకి వచ్చి కిటికీలు, తాగునీటి పైపులు, నల్లాలు, ఇతర సామగ్రిలను ధ్వంసం చేస్తున్నారు. అలాగే మందుబాబులు సైతం రాత్రివేళల్లో పాఠశాలలో సిట్టింగ్‌లు చేస్తున్నారు. ఏప్రిల్ 19న వాటర్‌షెడ్ యాత్రకు గ్రామానికి వచ్చిన మంత్రి దామోదర్ రాజనర్సింహకు పాఠశాల ప్రహరీ సమస్యపై ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి తక్షణమే పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చినా.. నేటివరకూ పాఠశాలకు ప్రహరీ నిర్మించలేదు. కలెక్టర్ స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఐక్య ఉద్యమాలతో మోదీకి బుద్ధి చెబుదాం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెట్టుబడిదారుల కోసమే నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని, కార్మికవర్గం ఏకమై మోదీకి బుద్ధి చెబుదామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్ నుంచి కలెక్టరేట్ వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహం వరకు సీఐటీయూ నాయకులు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే దేశ స్వాతంత్ర్యాన్ని, ఆర్థిక స్వావలంబనను తాకట్టు పెడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, జీ.సాయిలు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

**●సంగారెడ్డి రూరల్:** నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ బుధవారం సంగారెడ్డిలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగులు, సిబ్బంది ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీష్, లక్ష్మయ్య, రాజారాం, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**●నారాయణఖేడ్ :** ఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు. కార్మిక రంగాన్ని., కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకే లేబర్ కోడ్‌లను తెచ్చారని ఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేష్ తెలిపారు. కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్మిక సంఘం బాధ్యులు చంద్రకళ, రాజు,ఏసు, నాగయ్య, సిద్దమ్మ, నిర్మల, నర్సమ్మ పాల్గొన్నారు.

## సొసైటీ సమావేశం జరపరా..?

- ఐదేళ్లుగా జరగని పాలకవర్గ సమావేశం
- చర్యలకు ఇన్‌చార్జి డీసీవోకు రైతుల ఫిర్యాదు



ఫిర్యాదు పత్రాన్ని అందిస్తున్న రైతులు

నిజాంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సహకార పరపతి సంఘంలో అర్ధ సంవత్సర సమావేశం ఏర్పాటు చేయడం లేదంటూ రైతులు బుధవారం ఫిర్యాదు చేశారు. అందువల్ల సహకారశాఖ చట్ట ప్రకారం తగిన చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి జిల్లా అధికారి శంకర్‌ను కోరారు. ఐదేళ్ల నుంచి ఒక్కసారి కూడా జనరల్ బాడీ మీటింగ్ లేకుండా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీనివల్ల సొసైటీలో లావాదేవీలపై రైతులకు తెలియటం లేదన్నారు. అదేవిధంగా సొసైటీలో లావాదేవీలు లేక దీర్ఘకాలిక మొండిబకాయిగా పరిగణించారని, దీనివల్ల రైతులకు నష్టం వాటిల్లుతున్నదని తెలిపారు. రైతులకు తెలియకుండా రైతు ఖాతాల్లో ఎక్కువ ఉన్నట్టుగా చూపించినందున రుణమాఫీ కాక ఎంతోమంది రైతుల నష్టపోయారని, తక్షణమే స్పందించి కార్యవర్గాన్ని రద్దు చేసి, రైతులకు న్యాయం చేకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ శనిగపల్లి రాజం, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, రైతులు గాండ్ల విట్టల్, సుధాకర్, శ్రీశైలం, బాగాగౌడ్, స్వామి, ఎల్లం తదితరులు ఉన్నారు

## రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది

- నల్సార్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్ హెచ్.వాగిషన్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ వాగిషన్

హుస్నాబాద్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ పౌరునిపై ఉన్నదని నల్సార్ లా యునివర్సిటీ ప్రొఫెసర్ హెచ్.వాగిషన్ అన్నారు. బుధవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో 'భారత రాజ్యాంగం-విశిష్టత' అనే అంశంపై మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోని అన్ని దేశాల్లో కంటే గొప్ప రాజ్యాంగమని, దీనిని కొంతమంది మతవాదులు, రాజ్యాంగ వ్యతిరేకులు ప్రజాస్వామ్యాన్ని నిర్మూలించే విధానాన్ని పని కట్టుకొని చేస్తున్నాయన్నారు. వారి పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. దీనికి ముందు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సదస్సులో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి ఫోన్‌లో మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని ప్రతి విద్యార్థి అధ్యాయనం చేయాలన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, కో ఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, చిత్తారి రవీందర్, డ్యాగల సారయ్య, ఓయూ జేఏసీ నాయకులు గంపల శ్రీనివాస్, చెప్యాల ప్రకాష్, శంకర్, నాంపల్లి సమ్మయ్య, కవి రచయిత వడ్డెపల్లి మల్లేశం, ముక్కెర సంపత్ తదితరులున్నారు. అలాగే హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, తెలంగాణ అంబేడ్కర్ సంఘం, పట్టణ బీజేపీశాఖ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

## చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



ఉమెరుద్దీన్(ఫైల్)

వెల్దుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ ఓ విద్యార్థి మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన వెల్దుర్తిలో చోటు చేసుకుంది. వెల్దుర్తికి చెందిన మహ్మద్ ఉమెరుద్దీన్(16) సంగారెడ్డిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుకుంటున్నాడు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు.



# నామినేషన్ వేస్తున్నారా..?

● కావాల్సిన పత్రాలు, తెలుసుకోవాల్సిన నిబంధనలు




హుస్నాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థులకు కావాల్సిన పత్రాలు, నిబంధనలు..

● గ్రామపంచాయతీ వార్డుసభ్యుడిగా, సర్పంచ్‌గా పోటీచేసే అభ్యర్థులు ఆ గ్రామ ఓటరు జాబితాలో వారి పేరు ఉండాలి

● సర్పంచ్‌కు పోటీచేసే అభ్యర్థికి ఓటరు ప్రతిపాదకునిగా ఉండాలి

- వార్డుసభ్యుడిగా పోటీచేసే అభ్యర్థికి ఓటరు ప్రతిపాదకునిగా ఉండాలి

● అభ్యర్థి ఫొటో, కుల, బర్త్ సర్టిఫికెట్, నో డ్యూస్ సర్టిఫికెట్, ఇద్దరు సాక్షులు, అభ్యర్థి సంతకంతో కూడిన రూ.50 అఫిడవిట్‌ను నామినేషన్ పేపరుతో పాటు అందించాలి.

● నామినేషన్ డిపాజిట్ అమౌంట్ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.1000, జనరల్‌కు రూ.2000, వార్డుసభ్యుడికి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.250, జనరల్‌కు రూ.500

● ఎన్నికల వ్యయాన్ని పర్యవేక్షించడానికి వీలుగా ఖర్చు నిమిత్తం ప్రతి అభ్యర్థి ఒక ప్రత్యేకమైన బ్యాంకు ఖాతాను ప్రారంభించాలి. అభ్యర్థి తన నామినేషన్ దాఖలు చేయడానికి కనీసం ఒకరోజు ముందు ఈ ఖాతాను ప్రారంభించాలి. ఈ బ్యాంకు ఖాతా నుంచే అభ్యర్థి తన మొత్తం ఎన్నికల వ్యయాన్ని ఖర్చు చేయాల్సి ఉంటుంది.

● సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ సెట్లు ఎన్ని వేసినా ఒకే డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. వార్డుసభ్యులు ఒకటి కంటే ఎక్కువ వార్డుల్లో నామినేషన్లు వేసినా ఒక వార్డుకు మించి పోటీ చేయరాదు.

## సర్పంచ్ నుంచి పీఏసీ చైర్మన్ వరకు..

● దివంగత ఎమ్మెల్యే పట్లోళ్ల కిష్టారెడ్డి ప్రస్థానం



పట్లోళ్ల కిష్టారెడ్డి (ఫైల్)

నారాయణఖేడ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ స్థాయి నుంచి సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే, దివంగత పట్లోళ్ల కిష్టారెడ్డి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ వరకు ఎన్నికయ్యారు. 1942 అక్టోబరు 2న నారాయణఖేడ్ మండలం పంచగామలో జన్మించిన కిష్టారెడ్డి న్యాయశాస్త్రంలో పట్టా పొంది 1967లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గోల్డ్‌మెడల్ సాధించారు. 1970లో కాంగ్రెస్‌లో చేరి, పంచగామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పంచగామ గ్రామపంచాయతీ పరిధిలో అప్పట్లో పగిడిపల్లి, రుద్రార్, జగన్నాథ్‌పూర్, బాణాపూర్, జూజాల్‌పూర్, పిప్రి గ్రామాలు ఉండేవి. అనంతరం సూపర్ బజార్ చైర్మన్‌గాను పని చేసి, ప్రభుత్వ న్యాయవాదిగాను సేవలందించి, 1989, 1999, 2009, 2014లలో నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన టీడీటీ బోర్డు సభ్యుడిగా రెండుసార్లు పీఏసీ చైర్మన్‌గా పనిచేశారు. సర్పంచ్ స్థాయి నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, పీఏసీ చైర్మన్‌గా పనిచేయడమే కాకుండా ప్రస్తుతం ఆయన కుమారుడు సంజీవరెడ్డి నారాయణఖేడ్ ఎమ్మెల్యేగా పనిచేస్తున్నాడు.

# ఏకగ్రీవ ఎత్తులు

(5వ పేజీ తరువాయి)

ఆశావహులు నజర్ పెట్టారు. ఏకగ్రీవం చేసుకుంటే పెట్టిన పెట్టుబడికి సేఫ్‌జోన్‌లో ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ దిశగా చర్చలు సైతం నడుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికల్లోనూ స్థలాలు, డబ్బులు నజరానాగా ఇచ్చి ఏకగ్రీవం చేసుకున్నారు.

**భూములు, నగలు తాకట్టుపెట్టి..**

అనూహ్యంగా ఎన్నికలు తెరమీదకు రావడంతో ఆశావహులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నామినేషన్, ఇతర ప్రచార ఖర్చుల కోసం భార్య నగలు తాకట్టు పెడుతున్నానని ఓ నాయకుడు 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి' దృష్టికి తెచ్చాడు. తన వ్యవసాయ భూమి అమ్మకానికి పెట్టానని, ఒకవేళ సరైన ధర రాకుంటే ఎవరికైనా తాకట్టుపెట్టి వడ్డీ చెల్లిస్తానని చెప్పుకొచ్చాడు. ఇది ఒక్కరి పరిస్థితే కాదు. ప్రస్తుతం రియల్‌ఎస్టేట్ రంగం కుదేలు కావడంతో చాలామంది వద్ద డబ్బులు కరువయ్యాయి. కొనుగోలు చేసిన భూములు, స్థలాలను నమ్ముకొనే పోటీకి సిద్ధపడుతున్నారు. సర్పంచ్‌గా గెలిస్తే పలుకుబడితోపాటు ఆర్థికంగానూ బాగుపడతామనే ఆలోచనతో అప్పులు చేస్తున్నారు.



కోహిర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



భానూరు పంచాయతీ కార్యాలయం

## మూడు గ్రామాల మండలం పటాన్‌చెరు

పటాన్‌చెరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో జిల్లాలో అతి చిన్న మండలంగా పటాన్‌చెరు మిగిలిపోయింది. కేవలం మూడు గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. భానూరు 7,084, నందిగామ 3,564, క్యాసారం 2,350 ఓటర్లతో గ్రామాల్లో ఎన్నికలు జరుపుతున్నారు. గతంలో 28 గ్రామాలుండగా అమీన్‌పూర్ మండలంగా విడగొట్టగా 19 గ్రామాలు మిగిలాయి. ఇస్నాపూర్‌ను మున్సిపల్‌గా చేసినప్పుడు 11 మిగిలాయి. ఇప్పుడు ఇంద్రేశం పురపాలక సంఘం ఏర్పాటైంది. చివరకు మూడు గ్రామాలతో జిల్లాలో అతి చిన్న మండలంగా పటాన్‌చెరు మిగిలిపోయింది.

## ఉపాధ్యాయ ఉద్యోగం వదిలి..



ముత్యాల కిష్టయ్య

నారాయణఖేడ్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి నారాయణఖేడ్ పట్టణానికి చెందిన ముత్యాల కిష్టయ్య(87) నారాయణఖేడ్ మేజర్ గ్రామపంచాయతీకి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1938లో జన్మించిన కిష్టయ్య డిగ్రీ వరకు చదివి ఉపాధ్యాయుడిగా చేరి, అప్పటి దివంగత ఎమ్మెల్యే వెంకటరెడ్డికి అనుచరుడిగా కొనసాగారు. 1995లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 18 నెలల పదవీకాలం ఉన్నప్పటికీ, ఉద్యోగానికి రాజీనామా చేసి, సర్పంచ్‌గా పోటీచేసి 97 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. తెలంగాణ ఉద్యమంలో సైతం నియోజకవర్గ జేఏసీ కన్వీనర్‌గా పోరాటాలు చేశారు. ఈ సందర్భంగా ముత్యాల కిష్టయ్య మాట్లాడుతూ తాను సర్పంచ్‌గా రూ.5 లక్షల లోటుతో బాధ్యతలు చేపట్టి, రూ.3 లక్షల మిగులు బడ్జెట్‌తో బాధ్యతలు అప్పగించామని, అప్పటి రాజకీయాలకు, ఇప్పటి రాజకీయాలకు పోలిక లేదన్నారు.

## ఆగిపోయిన అమృత్ 2.0



మధ్యలోనే ఆగిపోయిన పనులు

నర్సాపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలో శాశ్వత నీటి పరిష్కారం కోసం రూ.12 కోట్లతో చేపట్టిన కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ 2.0 పనులను అసంపూర్తి దశలోనే నిలిచిపోయాయి. పట్టణంలో రెండు ట్యాంకుల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నది. నర్సాపూర్-మెదక్ మార్గంలో మూతపడ్డ చెరకు ఫ్యాక్టరీ వెనకభాగంలో కేటాయించిన స్థలంలోని ట్యాంకు నిర్మాణం పనులు మొన్నటివరకు చకచకా సాగి కొన్నిరోజుల నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. 750కెఎల్ నిల్వ సామర్థ్యం గల ఈ భారీ ట్యాంకు నిర్మాణం చివరిదశకు వచ్చాక నిలిచిపోవడం విశేషం. నర్సాపూర్-కాగజ్‌మద్దూర్ మార్గంలో 600కెఎల్ సామర్థ్యంతో మరో ట్యాంకు నిర్మాణం చేపట్టాలని స్థలం కేటాయించారు. అది వివాదాస్పదంగా మారింది. కొందరు తమ స్థలమంటూ అభ్యంతరం తెలపడంతో ఆ పనులు అసలే మొదలుకాలేదు. ట్యాంకుల నిర్మాణం పూర్తయితే పట్టణంలో 15 వార్డుల్లో 12 కిలోమీటర్ల మేర పైపులైన్ వేయాల్సి ఉంటుంది. ట్యాంకుల నిర్మాణమే సాఫీగా సాగకపోవడంతో పైపులైన్ పనులు ఇక ఎప్పుడు మొదలుపెడుతారో అన్న అనుమానం వ్యక్తమవుతోంది. పట్టణంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో ప్రస్తుతం భగీరథ నీరు సరఫరా కావడం లేదు. మంజీర, బోర్ల నీటి నిల్వ సరిపడా ట్యాంకులు లేక సమస్యలు తలెత్తుతున్నాయి. అమృత్ 2.0 పథకం ద్వారా చేపట్టిన పనులు పూర్తయితే పట్టణంలో శాశ్వతంగా నీటి సమస్య తీరుతుందని ఆశిస్తున్న ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తయ్యేటట్టు చూడాలని కోరుతున్నారు.

## నాచగిరి లక్ష్మీనృసింహస్వామి హుండీ లెక్కింపు

● సమకూరిన రూ.29 లక్షల ఆదాయం



హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న అధికారులు, భక్తులు, భ్రమరాంభికా సేవాసమితి సభ్యులు

వర్గల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం హుండీ లెక్కింపు బుధవారం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా, ఆలయ కార్య నిర్వహణ అధికారి విజయరామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ లెక్కింపుకు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మీ పర్యవేక్షణలో జరిగింది. నాచగిరి క్షేత్రం 154 రోజులకు (26-6-2025 నుంచి 26-11-2025)వరకు లెక్కింపు నిర్వహించగా రూ.29,62,845 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే మిశ్రమ బంగారం 61 గ్రాములు, కిలో 337 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చంద నాగరాజు, గాలి కిష్టయ్య, ఉష్షశ్రీ రాజశేఖర్ శర్మ, కర్రె పద్మావెంకటేశ్, జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా, నాయకం శ్రీనివాస్, రుద్రశ్రీహరి, కొత్తపల్లి శ్రీనివాస్, ఆలయ అధికారులు సుధాకర్, నరేందర్, పాండుతోపాటు భ్రమరాంబికా సేవాసమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## అవుసుల కుంట కట్ట పోశారు



అవుసుల కుంటను మళ్లీ పోసిన అధికారులు

తూప్రాన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని అవుసుల కుంటను ఇరిగేషన్ అధికారులు యధావిధిగా పోశారు కొందరు. కంటను తొలగించి రోడ్డు వేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై పత్రికల్లో వార్తలు రావడంతో ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేశారు. బుధవారం ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్, ఏఈ అనురాధ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించిన మట్టిని పోసి అవుసుల కుంట కట్టను యధావిధిగా పోశారు. కొందరు కాంగ్రెస్ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉమ్మన్నగారి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు.

# వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు

● వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవ క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు

కొండపాక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు వైభవంగా జరిగాయి. క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం ఆరున్నర గంటలకు గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సంతాన మల్లికార్జునస్వామికి విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించి విజయదుర్గా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వస్తి వాచనం, కలశస్థాపన, నవగ్రహ దిక్పాలక స్థాపన, స్థాపిత దేవతాపూజ నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్య స్వామికి, ఉత్సవమూర్తులకు విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రాల మధ్య కల్యాణం జరిగింది. మోహన్‌కృష్ణశర్మ, వేదవ్యాస్ లక్ష్మణరావు తదితరులు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు చీకోటి మల్లికార్జున్, నర్సింహారెడ్డి, గట్టు విఠల్, అయితా బాలరాజేశం, మర్యాల రవీందర్, మర్యాల వీరేశం, రాజు, మల్లేశం పాల్గొన్నారు.

# అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొననున్న తొగుట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

కొండపాక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర అమెరికా తెలుగు సంఘం నిర్వహిస్తున్న అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని రుచితకు ఆహ్వానం వచ్చింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక ప్రతిష్ఠాత్మకంగా ఈనెల 30 ఆదివారం అంతర్జాలంలో ప్రతిష్ఠాత్మకంగా 13 గంటలపాటు బాల సాహిత్య భేరి పేరుతో అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనం నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో టి.రుచిత పాల్గొంటుందని ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు డా.బీ. సుధాకర్, రఘురాం తెలిపారు. వచన కవిత్వం, గేయం, పద్యం విభాగాల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు విద్యార్థులు 101 మంది పాల్గొంటారు. ఈ చిన్నారి వచన కవిత విభాగంలో ఎంపికైందని, మూడు నిమిషాలపాటు కవిత వినిపిస్తుందని తెలిపారు. విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు, ప్రఖ్యాత బాల సాహితీవేత్తలు, జాతీయ అంతర్జాతీయ ప్రముఖులు పాల్గొంటున్న కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినికి అరుదైన అవకాశం కల్పించిన తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్, సమన్వయకర్త శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.

●తొగుట: ఉత్తర అమెరికా తెలుగు సంఘ ప్రపంచ సాహిత్య వేదిక ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి తొగుట ప్రభుత్వ పాఠశాల చెందిన విద్యార్థులు విష్ణువర్ధన్, రేఖ, శ్రీనివాస్, జస్వంత్, ఓంకార్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

●చిన్నకోడూరు : చిన్నకోడూరు మండలం అనంతసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.విశ్వతేజ, బి.రవిత్రేయని అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు కోట జ్యోతి బుధవారం తెలిపారు.

## వెనకబడిన వర్గాల్లో చైతన్యం నింపిన కవి అందెశ్రీ

● కవి బెల్లంకొండ సంపత్‌కుమార్



గజ్వేల్‌లో నిర్వహించిన సంస్మరణ సభలో మాట్లాడుతున్న కవి బెల్లంకొండ సంపత్‌కుమార్

గజ్వేల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన వర్గాల్లో చైతన్యం నింపిన కవి అందెశ్రీ అని కవి బెల్లంకొండ సంపత్‌కుమార్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో జోన్ కన్వీనర్ జిల్లెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కవి అందెశ్రీ, ఏపీటీఎఫ్ నిర్మాణ బాధ్యులు కే.నారాయణ సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంపత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సాహిత్య ఉద్యమంలో, తెలంగాణ ఉద్యమ పోరాటంలో కవిగా అందెశ్రీ పాత్ర మరువలేనిదన్నారు. అందెశ్రీ సమాజంలో వెనుకబడిన వర్గాలను చైతన్యవంతులుగా చేయుటకు, తెలంగాణలో ప్రతి పల్లెకు ఆయన పాట చేరిందన్నారు. నారాయణ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయులకు ఎంతగానో సేవచేశారని, అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం ఎంతో లోటన్నారు. ఆయనవెంట కవి కందుకూరి శ్రీరాములు, ఉపాధ్యాయ దర్శిని మాజీ సంపాదకులు ప్రకాశ్‌రావు, టీపీటీఎఫ్ కార్యదర్శి రాజయ్య, పూర్వ అధ్యక్షుడు ఏడెల్లి రాంచంద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్, ఉపాధ్యక్షుడు పాపిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, మంజుల, అక్కారం సత్తయ్య, పర్వతం నరసయ్య, తాళ్ల నాగరాజు, గోవర్ధన్‌రెడ్డి, విద్యాసాగర్, వెంకట్, రాజనర్సింహ, పోచం, రాములు ఉన్నారు.

## బెల్టుషాపులపై మెరుపుదాడి

హవేళీఘణపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భూర్గుపల్లిలో బెల్టు షాపులపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ షాపులో 16 లీటర్ల మద్యం, ఇలిటెం రాములు షాపులో 21 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.19 వేలు ఉంటుందని, సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.



కోహీర్‌లో ఉదయం పూట వ్యాయామం చేస్తున్న యువకులు

# చలికాలం.. చేయాలి వ్యాయామం

● ఆరోగ్యానికి ఉపయోగకరం

● మార్నింగ్ వాక్‌తో చురుకుదనం

కోహీర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చలికాలంలో ఉదయం వేళ ఆలస్యంగా నిద్రలేస్తూ.. చాలా మంది వ్యాయామాన్ని పాటించరు. ఏ కాలంలోనైనా తగిన శారీరక శ్రమ ఉంటే బద్ధకం తగ్గి ఒంట్లో చురుకుదనం పెరుగుతుంది. ఎముకలు పటిష్ఠతకు వ్యాయామం అవసరం. చలికాలంలో బిగుసుకుపోయే కీళ్లు మామూలుగా తయారవ్వాలంటే ప్రతిరోజు వ్యాయామం చేయాలి. ఎక్కువ గంటలపాటు కదలకుండా కూర్చుని ఉద్యోగం చేసే వాళ్లు ప్రతి గంటకోసారి లేచి ఐదు నిమిషాల పాటు నడవాలి. వ్యాయామంలో వెయిట్ ట్రైనింగ్ కూడా చేయాలి. చర్మానికి తగినంతగా సూర్యరశ్మి అందితే ఎముకలకు మేలు జరుగుతుంది. అంతేకాకుండా ఎముకలకు శక్తినిచ్చే విటమిన్ కలిగిన పదార్థాలను తీసుకోవాలి. చలికాలంలో చేతులు, పాదాలు మెడ, మోకాళ్లు, కీళ్లు బిగుసుకుపోయి.. కదిలిస్తే శబ్దాలు చేస్తూ ఉంటాయి. అలాంటప్పుడు కాల్షియంతో పాటు విటమిన్-డి తీసుకోవడం ఎంతో అవసరం. ఆహారం ద్వారా శరీరంలోకి చేరే కాల్షియం పూర్తిగా శోషించుకోవాలంటే విటమిన్-డి కావాలి. కాబట్టి చలికి భయపడి పండుకోకుండా నీరెండలో కొద్దిసేపైనా తిరగాలి. అలాగే విటమిన్-డి ఉండే పాలు, గుడ్లు చేపలు తరుచుగా తినాలి.

**చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

చలిగాలికి జడిసి స్నానం మానేయడం అనారోగ్యానికి కారణవుతుంది. రెండు పూటలా స్నానం చేయడం, తగినన్ని మంచినీళ్లు తాగడం చలికాలంలోనూ అవసరమే.. రాగులు, కొర్రలు, సజ్జలు, జొన్నలు, వంటి చిరుధాన్యాలు వినియోగంతో శరీరానికి కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, జింకు, భాస్వరం, ప్రోటీన్లు, పీచు, కొవ్వు పదార్థాలు, లవణాలు తగినంతగా అందుతాయి. వీటి వాడకం రాను రాను గణనీయంగా తగ్గడంతో ఆరోగ్య సమస్యలు అధికమవుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిరుధాన్యాలను విరివిగా తీసుకుంటే మధుమేహం, రక్తహీనత, నేత్రవ్యాధులు, మలబద్ధకం, కీళ్ల నొప్పులు, నరాల బలహీనత, రుతుస్రావ సమస్యలు, అధిక రక్తపోటు, అల్సర్లు, కిడ్నీలో రాళ్ల, జీర్ణక్రియ, ఎముకల పట్టుత్వం, రోగనిరోధక శక్తి వృద్ధి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరణకు ఎంతో మేలు జరుగుతుంది.



వ్యాయామం చేస్తున్న యువకులు

**వాకింగ్‌తో ఆరోగ్యానికి మేలు**



చలికాలంలో వాకింగ్ చేయడం వల్ల శరీరం చురుకుదనంగా ఉంటుంది. ప్రతి సంవత్సరం శీతాకాలంలో వాకింగ్ వెళ్తాం. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ వాకింగ్ చేస్తే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.

- ప్రేమ్‌రాజ్, బిలాల్‌పూర్

**చలికాలంలో వ్యాయామం అవసరం**



చలికాలంలో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయడం ఎంతో అవసరం శీతాకాలంలో తీవ్రమైన చలి ఉండడం వల్ల శరీరంలోని అవయవాలు బిగుసుకుపోవడమే కాకుండా అనేక రకాలైన నొప్పులు, రోగాలు వస్తాయి. వీటిని నివారించేందుకు వ్యాయామం చేయడం ఉత్తమం.

- అబ్దుల్ ముజీబ్, వ్యాయామ ఉపాధ్యాయుడు

**డీ-విటమిన్ ఉన్న పదార్థాలు తీసుకోవాలి**



చలికాలంలో ఎముకల ప్రతిష్ఠతకు డీ-విటమిన్ గల పదార్థాలు అవసరం. ఉదయం వాకింగ్, వ్యాయామం చేసిన తర్వాత తప్పనిసరిగా పాలు, గుడ్లు తీసుకోవాలి. చలికాలంలో ఉదయం పూట లేచి వ్యాయామం చేస్తే శరీరంలో రక్తం పల్చబడిన రక్త ప్రసరణ కూడా బాగా జరుగుతుంది.

- నవీన్‌కుమార్, దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



కోహెడ హైస్కూల్లో రాజ్యాంగాన్ని ఆమోదించే చర్చను ప్రదర్శిస్తున్న విద్యార్థులు.


మిరుదొడ్డిలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలను వేస్తున్న ఎంపీడీవో గణేష్‌రెడ్డి


దౌల్తాబాద్ : మండల కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంఈవో గజ్జల కనకరాజు, ఉపాధ్యాయులు

జిల్లాలో బుధవారం భారత రాజ్యాంగ దిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అంబేద్కర్, జగ్జీవన్‌రావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు, ర్యాలీ నిర్వహించారు.ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ, దేశ అభివృద్ధికి పాటుపడాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి అన్నారు. డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారమే భారతదేశం నడుస్తుందని దౌల్తాబాద్ మండల విద్యాధికారి గజ్జల కనకరాజు అన్నారు.

-న్యూస్‌నెట్‌వర్క్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి)


సిద్దిపేట పట్టణంలోని గౌతమ్ పాఠశాలలో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విద్యార్థులు



గజ్వేల్: డిగ్రీ కళాశాలలో కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకుంటున్న కళాశాల సిబ్బంది

## ఈనెల 30న ఉచిత టెట్ మోడల్ పరీక్ష

సిద్దిపేట కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : షైన్ టెట్ కోచింగ్ ఆధ్వర్యంలో ఉచిత టెట్ మోడల్ పరీక్షను ఈనెల 30న సిద్దిపేటలోని ప్రతిమ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు సెంటర్ డైరెక్టర్ వంశీకృష్ణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్ష రాయబోయే అభ్యర్థులు ఒక్కరోజు ముందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నెంబర్ 7659828804లో సంప్రదించాలని కోరారు. పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించిన అభ్యర్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వబడుతుందని చెప్పారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ములుగు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ములుగు, మాసాన్‌పల్లిలో మంగళవారం మధ్యాహ్నం పర్ష లక్ష్మి మృతి చెందగా ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి లక్ష్మి కుటుంబాన్ని ,సుంకరి స్వామి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని కూడా పరామర్శించి ఒక్కొక్కరికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట శివరాములు, నాగేష్, శ్రీనివాస్‌గౌడ్, ఉప్పరి నర్సింలు, సాయిలు, మల్లేష్‌తో పాటు తదితరులున్నారు.

### పరామర్శించి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు

కొమురవెల్లి :మండలకేంద్రానికి చెందిన కడమంచి ఏల్లవ్వ అనారోగ్యంతో కొద్దిరోజుల క్రితం మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం పరామర్శించి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ 50 కిలోల బియ్యాన్ని,మండల ఉపాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

## నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

● ఐదు మండలాల్లో మొదటి విడతలో..

గజ్వేల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. నేటి నుంచి గజ్వేల్ నియోజకవర్గంలోని గజ్వేల్, జగదేవ్‌పూర్, మర్కుక్, ములుగు, వర్గల్ మండలాల్లో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఐదు మండలాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి మొదటి విడతలో భాగంగా నామినేషన్లను స్వీకరించేందుకు అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు అభ్యర్థులను వెతుక్కునే పనిలో పడ్డారు. అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఆయా గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులతో పాటు వార్డు మెంబర్ల అభ్యర్థులను బరిలో దించేందుకు కసరత్తు చేస్తున్నారు.

### ములుగు మండలంలో సర్పంచ్ ఎన్నికల కోసం 7 క్లస్టర్లు

ములుగు మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల దాఖలాలకు ఏడు క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో మేరీ స్వర్ణకుమారి తెలిపారు. మండలంలో ఉన్న 26 గ్రామ పంచాయతీలను ములుగు, సింగన్నగూడ, బైలంపూర్, కొత్తూరు, క్షీరాసాగర్, నర్సంపల్లి, చిన్నతిమ్మాపూర్ క్లస్టర్లుగా విభజించి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యుల రిజర్వేషన్‌లు కూడా ప్రకటించినట్లు ఆమె వెల్లడించారు.

### రాయపోల్‌లో..

రాయపోల్ మండలంలోని గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లు, పరిశీలన కోసం ఐదు క్లస్టర్లను ఏర్పాటుచేసినట్లు ఎంపీడీవో జమ్లా నాయక్ తెలిపారు. అనాజీపూర్ క్లస్టర్‌లో అనాజీపూర్‌తో పాటు మంతూరు, చిన్నమాసాన్‌పల్లి, ఆరెపల్లి గ్రామాలు, రాయపోల్ క్లస్టర్‌లో రాయపోల్, తిమ్మక్కపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాలు, రాంసాగర్ క్లస్టర్‌లో రాంసాగర్, ముంగిస్‌పల్లి, కొత్తపల్లి, అంకిరెడ్డిపల్లి గ్రామాలు, వడ్డెపల్లి క్లస్టర్‌లో వడ్డెపల్లి, వీరారెడ్డిపల్లి, బేగంపేట, ఎల్కల్ గ్రామాలు, రామారం క్లస్టర్‌లో రామారం, గొల్లపల్లి, టెంకంపేట, సయ్యద్‌నగర్ గ్రామాల అభ్యర్థులు నామినేషన్‌లు వేయాల్సి ఉంటుందని ఎంపీడీవో తెలిపారు.

## ఎన్నికల సరళిపై విద్యార్థులకు అవగాహన

కొమురవెల్లి, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురువన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు చేత గ్రామ పంచాయతీ ఎన్నికల మాక్ పోలింగ్ నిర్వహించి విద్యార్థులకు ఎన్నికల సరళిపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. పలువురు విద్యార్థులు ఎన్నికల అధికారులుగా, మరికొందరు అభ్యర్థులుగా, ఓటర్లుగా వ్యవహరించి మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని విద్యార్థులే నిర్వహించారు. అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులుగా ఎన్నికైనట్లు ప్రకటించారు.ఉపాధ్యాయులు మాట్లాడుతూ...

భారత రాజ్యాంగం పట్ల, గ్రామ పంచాయతీ ఎన్నికల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడానికే మాక్ పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.విద్యార్థులు ఉత్సాహంతో ఎంతో ఆసక్తిగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నట్లు తెలిపారు.



ఓటు అనే పదం ఆకారంలో కూర్చున్న విద్యార్థులు


ఓటుహక్కును వినియోగించుకుంటున్న విద్యార్థి

## రైతులకు న్యాయం చేకూరుస్తా..

రామాయంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట సొసైటీ చైర్మన్‌గా తిరిగి పదవి రావడం సంతోషంగా ఉందని బాదే చంద్రం హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జిల్లాలోని సొసైటీల పదవీకాలం పొడిగింపులో రామాయంపేటను చేర్చలేదు. దీంతో చైర్మన్ నేతృత్వంలో ఆరుగురు డైరెక్టర్లు హైకోర్టుకు వెళ్లి పదవి సాధించారు.ఈ మేరకు బుధవారం స్థానిక సహకార సంఘం పరపతి కార్యాలయంలో బాదె చంద్రంకు ఘన సన్మానం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల రుణాలపై తన వంతుగా సహకరిస్తానన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే హవా

●దుబ్బాక నియోజక వర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి


తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ తో పాటు పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

తొగుట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు విజయఢంకా మోగించడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజక వర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం తొగుటలో నూతనంగా ఎన్నికైన తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు, పాలక వర్గ సభ్యులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో తప్పక గుర్తింపు లభిస్తుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ రెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహులు, మండల పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, నాయకులు విజయ్‌పాల్ రెడ్డి, సోలిపేట ప్రసాద్ రెడ్డి, మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ

గజ్వేల్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు.

## కార్మిక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

గజ్వేల్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రం కార్మిక కోడ్‌లను వెంటనే రద్దు చేసి రైతు వ్యతిరేక చర్యలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. 29వ కార్మిక చట్టాల రద్దుతో రూపొందించిన నాలుగు లేబర్ కోడ్ల వద్ద కార్మికుల ఉపాధికి కరువు ఏర్పడుతుందని, లేనిచో దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు

## గొల్లకురుమల పట్ల వివక్ష తగదు

చేర్యాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయ కమిటీ ఏర్పాటులో గొల్ల, కురు మల పట్ల వివక్ష వహించడం తగదని తెలుగు యువత అధికారప్రతినిధి, కురుమసంఘం రాష్ట్ర నాయకుడు ఒగ్గు రాజు అన్నారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొమురవెల్లి మల్లన్న గొల్ల, కురుమల ఆరాధ్యుడైనప్పటికీ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చిన్నచూపు వహిస్తూ ఆయా సామాజికవర్గాలకు పాలకమండలిలో ప్రాధాన్యం కల్పించకపోవడం తగదన్నారు. గతంలో ఆలయ చైర్మన్‌ను గొల్ల, కురుమలకే కట్టబెట్టినప్పటికీ అణిచివేత ధోరణితో వ్యవహరించడాన్ని ఖండిస్తున్నామన్నారు.

## చదువుతో సమాజంలో మంచి గుర్తింపు

చిన్నకోడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :(చదువుతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సిద్దిపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నేతి కైలాసం ఆధ్వర్యంలో షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏంఈవో తిరుపతి, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు హై స్కూల్‌లో మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్ రెడ్డి

# వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

చేర్యాల/హుస్నాబాద్ టౌన్/దుబ్బాక, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణేశ్వర స్వామి స్కందషష్టి పురష్కరించుకుని బుధవారం స్వామి వారి కల్యాణం ఘనంగా జరిగింది. అక్బర్‌పేట- భూంపల్లి మండలం కూడవెల్లి శ్రీస్మృతిశ్రీనివాస గోసాలల్లో వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వేద పండితులు,మంత్రోచ్చారణలతో వైభవంగా స్వామి నిర్వహించారు. రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు. ప్రముఖ జ్యోతిష్యపండితులు సాకేత్‌శర్మ ఆధ్వర్యంలో లోకకళ్యాణార్థం చేపట్టిన ఈకార్యక్రమంలో గణపతి పూజా,పుణ్యావాచనం, గోపూజా , పంచగవ్య ప్రాశన, సుబ్రమణ్య అభిషేకం , అగ్నిప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, సుబ్రామణ్యస్వామి పాశుపత హోమం, దివ్యకళ్యాణోత్సవం, అన్నప్రసాద వితరణలు నిర్వహించారు.

### చేర్యాలలో

చేర్యాల పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీవల్లీదేవసేనసమేత సుబ్రహ్మణ్యస్వామి దేవతామూర్తుల ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలు అలంకరించారు. ఆలయ అర్చకులు దేశపతి చైతన్యవర్మ, ప్రహ్లాద్‌ల వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తయుక్తంగా పూజాధికాలు జరిపారు. అయ్యప్పమాలాధారణ స్వాములు పాల్గొని భజనలు చేశారు.


సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

### హుస్నాబాద్ టౌన్‌లో

హుస్నాబాద్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో బుధవారం సుబ్రహ్మణ్య స్వామి షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన, పాలాభిషేకం, పళ్ళతో అభిషేకాలు చేశారు.

## మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


భూంపల్లి పెద్దచెరువులో ఉచిత చేపపిల్లలను వదులుతున్న రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి,నవంబరు26(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తుందని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య అన్నారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి పెద్దచెరువులో ప్రభుత్వం అందించిన ఉచిత చేపపిల్లలను ముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి చెరువులోకి వదిలారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్యకారులను ఆర్థికాభివృద్ధేలక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. అందులోభాగంగానే మత్స్యకారులకు ఉచితంగా చేపలను పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ముదిరాజ్ సొసైటీ సంఘం సభ్యులు తదితరులున్నారు..

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

దౌల్తాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి ): దౌల్తాబాద్ మండలంలో మొదటి విడుతలో 25 గ్రామపంచాయతీలకు డిసెంబరు 11న ఎన్నికలు జరగనున్నాయి. బుధవారం దౌల్తాబాద్ ఎస్సై అరుణ్ కుమార్ గాజులపల్లి, దొమ్మాట, సూరంపల్లి, తదితర గ్రామాల పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ నిర్వహణ తీరును గ్రామ ప్రజలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ. గ్రామాల్లో బెల్ట్ షాపులలో మద్యం అమ్మ రాదని, ప్రజలు గుంపులు, గుంపులుగా ఉండకూడదని తెలిపారు. అభ్యర్థులు ఎవరు ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించరాదని, గ్రామాలలో ఎలాంటి అల్లర్లు సృష్టించిన సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

### పకడ్బందీగా ఎన్నికలను నిర్వహణ

మిరుదొడ్డి : పకడ్బందీగా ఎన్నికలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను చేయడం జరుగుతుందని మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండలం ధర్మారం, లక్ష్మీనగర్, లింగుపల్లి, మల్లుపల్లి అల్వాల, చెప్యాల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికలకు ఓటర్లు సహకరించాలని సూచించారు.

### కొమురవెల్లిలో

కొమురవెల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పోలింగ్ స్టేషన్లను బుధవారం సీఐ శ్రీనివాస్ స్థానిక ఎస్సై మహేష్‌తో కలిసి పరిశీలించారు. భద్రత,ఇతర ఏర్పాట్లలో భాగంగా పోలింగ్‌స్టేషన్లను పరిశీలించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండపోచమ్మ దగ్గరలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

## ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు రాగిజావ

మద్దూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం గాగిళ్లాపూర్‌లోని షిరిడి సాయిబాబా టెంపుల్ ట్రస్టు చైర్మన్ తౌటి భూమయ్య ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు వారంలో మూడు రోజులు రాగిజావ, బెల్లం, పప్పులు, ఎక్కాల పుస్తకాలుతో పాటు గ్యాస్ స్టవ్, సిలిండర్ అందజేయడంపై బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయమై తౌటి భూమయ్య మాట్లాడారు. పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం వారంలో మూడు రోజులు మాత్రమే అందజేస్తున్న రాగి జావకు అదనంగా మిగతా మూడు రోజులకు తన వంతుకు రాగిజావతో పాటు బెల్లం,పప్పులు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థులు లక్ష్యంతో కూడిన విద్యాభ్యాసం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం హరిప్రసాద్, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం

మద్దూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశానుసారం వేసవికాలం శిబిరంలో విద్యార్థులకు వివిధ కళాకృతులలో శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను బుధవారం ఎంఈవో వరదరాజులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు అన్ని రంగాల్లో ఆరితేరే విధంగా తయారుచేయడంపై శుభపరిణామమన్నారు ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప 18వ పడిపూజ

ములుగు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలం వంటిమామిడి గ్రామంలో అయ్యప్ప 18వ పడిపూజ లక్ష్మణ్‌గౌడ్ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి అయ్యప్ప భక్తులు హాజరై పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.

## గుడి, బడి.. గమనించండి..!

(5వ పేజీ తరువాయి)

హైస్కూల్ ముందు వైన్స్ ఏర్పాటు చేశారు. దీనిపై ఉపాధ్యాయులు, పలువురు రాజకీయ నాయకులు ఆందోళన చేసినా, అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈసారి కాంచిటి వద్ద ప్రభుత్వ పాఠశాల, కళాశాల ముందు వైన్స్ ఏర్పాటు చేయకూడదని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

### గాంధీ చౌరస్తాలో బార్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలలు, కళాశాలల వద్ద, దేవాలయాల సమీపంలో, మహనీయుల విగ్రహాల వద్ద మద్యం దుకాణాలను ఏర్పాటు చేయవద్దు. కానీ సిద్దిపేట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఉన్న ప్రసిద్ధి చెందిన సిటిజన్ క్లబ్‌లో గత సంవత్సరం అధికారులు బార్‌కు అనుమతి ఇచ్చారు. అక్కడ బార్‌ను తొలగించాలని వివిధ సంఘాల నాయకులు, మేధావులు, రాజకీయ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### నిబంధనల ప్రకారం 100 మీటర్ల దూరంలో..

ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం గుడికి, బడికి, మహనీయుల విగ్రహాలకు దాదాపు 100 మీటర్ల దూరంలో మద్యం దుకాణం ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే, గుడికి, బడికి ఎదురుగా వైన్స్ ఏర్పాటు చేస్తే, దాని కొలతలను డివైడర్ నుంచి కాకుండా యూటర్న్ నుంచి కొలవాలి అనే నిబంధన ఉన్నది. ఈ నేపథ్యంలో నిబంధనల ప్రకారమే మద్యం దుకాణాలకు అనుమతి ఇస్తున్నామని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.